
# మాకీ నాన్న వద్దు

—కంచుమర్తి వెంకటేశ్వరరావు

1992 న్యూజెర్సీ
తెలుగు కళాసమితివారి
కథల పోటీలో
రూ.200లు బహుమతి
పొందిన కథ



## "నాన్న రోజూ మందు తాగుతాడు"
## "అవును"
## "సిగరెట్లు ఎన్ని కాలుస్తాడో"
## "అవును"

"అమ్మను అప్పుడప్పుడు రాత్రివేళ కొడతాడు"

"అవును... అమ్మ ఏడుస్తున్నప్పుడు చూసాను"

"అమ్మ మంచిది కదూ..."

"అవునక్కా... నాన్న రోజూ ఎందుకు తాగుతాడు?"

"అది నిషా ఇస్తుందని మా ఫ్రెండు చెప్పింది. అలా రోజూ తాగడం మంచిది కాదని మా టీచరు అంది".

"అక్కా....నేనూ తాగుతాను. తాగి నాన్న అమ్మను కొడుతున్నాడు కదా! నేను తాగి నాన్నను కొడతాను"

"తప్పు తమ్ముడూ! పెద్దవాళ్ళను కొట్టకూడదు. అది తాగితే చెడిపోతారు"

"మన నాన్న మంచివాడు కాదు. గోపి నాన్న ఎంత మంచివాడో. బొమ్మలు, స్వీట్లు రోజూ కొంటాడు. సినిమాలకు తీసుకెళతాడు. మరి మన నాన్న ఇంట్లో వుంటే అది తాగుతూ కూర్చుంటాడు"

పిల్లలను భోజనాలకు పిలుద్దామని గదిలోకి అడుగుబెట్టబోయిన లక్ష్మి గుమ్మం దగ్గరే ఆగిపోయింది. మొదటిసారిగా తండ్రి పట్ల పిల్లల్లో ఏర్పడిన దురభిప్రాయాన్ని గ్రహించిన లక్ష్మి మెదడు మొద్దుబారిపోయింది ఆ క్షణంలో.

గిరుక్కున వెనక్కు తిరిగి వరండాలోకొచ్చేసింది. అప్పటికే శ్యాంసుందర్ అర బాటిల్ ఖాళీ చేసి మత్తులోకి వెళ్ళిపోయాడు. అక్కడికక్కడే టీపాయ్ మీదున్న సరంజామాను బయటకు గిరాటేయాలన్నంత ఆవేశం వచ్చింది. అయితే ఆ పని చేయలేని నిస్సహాయతతో కళ్ళల్లో నీళ్ళు నింపుకొని కుర్చీలో కూలబడింది.

పేరుకు పెద్ద ఆఫీసరు. వేలకు వేలు జీతం. దేనికీ లోటు లేదు. లోటంతా మనశ్శాంతి. పెళ్ళయిన మూడో రోజే తెలిసింది భర్త తాగుబోతని. ఆమె ఎన్నోసార్లు ప్రయత్నించింది తాగుడు మాన్పించాలని. ఆమె మంచితనం, ప్రేమ, అభిమానం అన్నింటికి రెట్టింపయిన అందం ఏవీ పనిచేయలేదు. లక్ష్మి అతనితో రాజీపడుతూనే ఇద్దరు పిల్లల తల్లయింది.

పిల్లల భవిష్యత్తు పట్ల ఆమెకు ఎన్నెన్నో కలలు.

అమ్మాయి స్వాతిని డాక్టర్‌ను చెయ్యాలని,

అబ్బాయి రాజాను ఇంజనీరు చదివించాలని. భర్త తాగుడు గాని, తన కన్నీళ్ళు గాని పిల్లల కంట పడకూడదని ప్రతీ క్షణం జాగ్రత్తపడేది. పిల్లలకు ఏమీ తెలియదని తను భ్రమపడింది. కానీ.... కానీ వాళ్ళు చాలా ఎదిగిపోయారు. పదేళ్ళు నిండిన స్వాతి, ఎనిమిదేళ్ళయినా నిండని రాజా వయసుకు మించి ఎదిగి తండ్రి పట్ల ఏవగింపు, తన పట్ల సానుభూతి వారి గుండెల్లో నిండిపోయాయని, వారిలాగే పెరిగితే తనకు కాకుండా పోతారేమోనని, తన కలలు కల్లలవుతాయనే భయం. ఆ ఆలోచన కలగడమే తరువాయి లక్ష్మి నిలువెల్లా వణికిపోయింది.

"ఏమండీ మన పిల్లలు చాలా ఎదిగేరండీ... వాళ్ళిప్పుడు పరిసరాలను, పరిస్థితులను అర్థం చేసుకుంటున్నారు. మీరిలా తాగడం ఆ చిన్న మనసులకు బాధ కలిగిస్తుంది. పిల్లల పట్ల నేను పెంచుకున్న ఆశలను వమ్ముచేయవద్దు. మీరు పిల్లలకు దూరమవడం నేను సహించలేక పోతున్నానండీ. పిల్లల గురించయినా తాగుడు మానివేయండి"

మత్తు ఇంకా దిగలేదు. ఆమె మాటలు ఇంకా

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్

సగంలోనే వున్నాయి. అతని చేయి తెల్లటి ఆమె చెక్కిళ్ళను అరుణిమ చేసింది.

"పిల్లలకు భయపడి నా అలవాటు మానుకొమ్మడానికి నీకెంత ధైర్యం! నీకూ పిల్లలకూ ఏం లోటు చేస్తున్నాను? పిల్లలకు చెప్పు, పెద్ద పెద్ద ఆలోచనలు మాని బుద్ధిగా చదువుకోమను. పెద్ద మాటలు మాట్లాడితే ఒళ్ళు చీరేస్తానని చెప్పు"

లక్ష్మి కన్నీళ్ళు అదేపనిగా వర్షిస్తున్నాయి.

తలుపు చాటున నిలబడి అంతా చూస్తున్న పిల్లలు భయంతో వణికిపోయారు.

వారం రోజులకు కూతురునూ, పిల్లలనూ చూద్దామని వచ్చారు లక్ష్మి తండ్రి మాధవరావుగారు. పిల్లలతో సరదాగా గడుపుదామని వచ్చిన ఆ ముసలి తాతయ్య గుండె చెరువయింది మనవళ్ళ ఫిర్యాదులు విని.

అదే రాత్రి స్వయంగా చూశారు.

"నీ బాబుకూ, పిల్లలకూ భయపడి తాగవద్దంటావా... ఎవరు ఎక్కడ వుండాలో అక్కడ వుండండి"

డబ్బు...లంకంత ఇల్లు... తన కూతురు మహారాణిలా వుందని అనుకున్నారే గానీ అశాంతితో పిల్లల గురించే రోజులు గడుపుతూందని అప్పుడే తెలుసుకున్నారు.

గదిలోంచి బయటకు వచ్చిన లక్ష్మి తండ్రికి ముఖం చూపించలేకపోయింది. అప్పుడే పిల్లల చేతుల్లోని స్కూల్ బ్యాగ్‌లు, బట్టల సూట్‌కేస్‌లు చూసి కొయ్యబారిపోయింది.

"తాతయ్యా... మేము నీతో వచ్చేస్తాం. మాకీ నాన్నొద్దు.. అమ్మను రోజూ కొడుతున్నాడు... మమ్మల్ని కూడా కొడతానని, ఒళ్ళు చీరేస్తానని అంటున్నాడు. ఇక్కడే వుంటే మమ్మల్ని చంపేస్తాడు. మమ్మల్ని నీతో తీసుకుపో తాతయ్యా" తాతయ్యను చుట్టి వెక్కివెక్కి ఏడుస్తూంది స్వాతి.

"తాతయ్యా.... ఈ నాన్నొద్దు....నాకు అమ్మ కావాలి"

బొమ్మలా నిలబడిపోయిన లక్ష్మి గుండెలో అలజడి.

"అమ్మా... నేనూ, తమ్ముడూ తాతయ్యతో వాళ్ళ వూరు వెళ్ళిపోతాం.. నువ్వూ వచ్చేయ్ అమ్మా... నువ్వు లేకపోతే తమ్ముడు ఏడుస్తాడు. మేము అల్లరి చేయకుండా నువ్వు చెప్పినట్టు బాగా చదువుకుంటాం..."

లక్ష్మి గదిలోకి వెళ్ళింది.

భర్త పూర్తిగా మత్తులో వున్నాడు.

తన బట్టలు అన్నింటినీ సూట్‌కేస్‌లో సర్దుకుని బయటకు వచ్చింది.

"నాన్నా .... నేను ఇన్నాళ్ళూ పిల్లల గురించే ఈ నరకం అనుభవించాను. వాళ్ల భవిష్యత్తు పట్ల ఎన్నెన్నో కలలు కన్నాను. ఇంతవరకూ నే ఒక్కదాన్నే బాధపడుతున్నాననుకున్నాను గానీ పిల్లల మనసులను గ్రహించలేకపోయాను. ఇక్కడ ఇలాగే రాజీపడుతూ వుంటే నేను ఎవరి గురించైతే బ్రతుకుతున్నానో వాళ్ల నాకు దక్కరు. అందుకే పిల్లల మాట వినాలనే నిర్ణయం తీసుకున్నాను. నా డిగ్రీ నా పిల్లల భవిష్యత్తుకు దారిచూపించకపోదు" అంది.

మాధవరావుగారు మరింకేం మాట్లాడకుండా కూతురునూ, మనవలనూ తీసుకుని ఇంట్లోంచి బయటకు వచ్చారు.

ఆటో ఎక్కి వెనక్కు తిరిగి చూసింది లక్ష్మి.

మత్తు దిగేక తమగురించి వెదికితే భర్తకు దొరికే ఉత్తరం అతన్ని మారుస్తుందా! మారినా, మారకపోయినా ఫరవాలేదు. తను పిల్లల దారిలోనే నడవాలి... వారిని తన ఆశలకు అనుగుణంగా పెంచాలి.

"అటు చూడవద్దమ్మా.. నాన్న వచ్చాడంటే కొట్టేస్తాడు"

పిల్లల మాటలకు చూపు మరల్చింది లక్ష్మి.

ఆటో స్పీడుగా వెళుతుంటే లక్ష్మి పిల్లలను చూసింది.

పిల్లల కళ్ళలో సంతోషపు వెలుగులు చీకటిలో స్పష్టంగా కనిపించాయి ఆమె కళ్ళకు. ఆ వెలుగులు చాలు తమ మార్గాలను చూపేందుకు. ఆ వెలుగులు చాలు తన ఆశలను నిజం చేసేందుకు.

భర్తకు దూరమవుతున్నాననే బాధ దూరమై పిల్లల గుండెలకూ, వారి బంగారు భవిష్యత్తుకూ దగ్గరవుతున్నాననే తృప్తితో నిట్టూర్పు విడిచింది. ✶



● కలపను ఆదా చేసి అడవుల రక్షణకు తోడ్పడండి.

# Decorail®

కర్టెన్ కారియర్.

## పెల్మెట్స్‌కు 21 వ శతాబ్దపు పర్యాయము

పెల్మెట్లను పనికిరాని పురాతనమైన వాటిగా డికొరైల్ ఎలా చేస్తుందో చూడండి :

- సులువుగాను మరియు తొందరగాను అమర్చుకోవచ్చు.
- దానిని మీయంతట మీరు అమర్చుకోడానికి ఒక 'కిట్' కూడా...... మరి వడ్రం మేస్త్రీ అవసరం ఉండదు.
- టెలిస్కోపిక్ రైల్స్ వలన ఏ సైజులోగల కిటికీ/ద్వారానికైనా అమర్చుకోడానికి అది చాలా అనుకూలంగా ఉంటుంది.
- చిరకాలం మన్నుతుంది, పెయింటెడ్ మెటల్ మరియు ప్లాస్టిక్ భాగాలు.
- పెల్మెట్లకయే ఖర్చు మీద కనీసం 20% వరకూ ఖర్చు కలిసొస్తుంది.
- ప్రత్యేకముగా తయారు చేయబడిన కర్టెన్ టేప్ మరియు కొక్కెలు ఆటోమేటిక్‌గా ట్రిపిల్ ప్లీట్స్‌ను ఇస్తాయి తద్వారా సులువుగా శుభ్రం చేసుకోవడానికి మరియు ఇస్త్రీ చేసుకోడానికి వీలవుతుంది.

FLASH-TL 10099

Manufactured by: **AJAY WINDECOR PRODUCTS PVT. LTD.**
Regd. Office: Gurudeep - 2, Flat No. 12 Tulshibaugwale Colony,
Sahakar Nagar No. 2, Pune - 411 009. Phone - 436960. Fax - (0212) 444253

మెస్సర్స్ బి.డి మెటల్ కార్పొరేషన్, 5-8-589, అబిడ్ రోడ్, Iవ అంతస్థు, జమ్రూద్ టాకీస్ ఎదుట, హైదరాబాద్-500 001,
ఫోన్ నెం: 201375, 201489
ప్రాతినిధ్యములేని ప్రాంతములలో డీలర్‌షిప్ వివరములు ఆహ్వానింపబడుచున్నవి.